నా తొలికథ

కథా నిలయం
5646
శ్రీకాకుళం

# రివర్స్ కిక్

భానుప్రసాద్‌కి అసహనంగా ఉంది.

**అంతకుమించి కసిగా ఉంది తనమీద తన అసమర్థత మీదా కాదు. ఈ వ్యవస్థపైన, వ్యవస్థలో నాటుకుపోయిన లంచగొండితనం పైన.**

'ఇది రెండవసారి ఆ మేనేజర్ శ్రీరంగమూర్తి దగ్గర కెళ్ళడం మామూలు సంతకాల కోసం, అదీ కాస్త త్వరగా కావాలంటే లంచం అడుగుతున్నాడు, ముసలి పీనుగ!' తిట్టుకుంటూ ప్రొద్దున జరిగిన సంఘటన జ్ఞాపకం చేసుకున్నాడు.

"గుడ్ మార్నింగ్ సర్!" మేనేజర్ గదిలోకి అడుగిడుతూ విష్ చేసాడు.

భాను వయసు ముప్పై ఏళ్ళదాకా ఉంటుంది.

"వెరీవెరీ గుడ్‌మాణింగ్! కమాన్ అండ్ సిట్‌డౌన్" ఆహ్వానించాడు శ్రీరంగమూర్తి.

"వాళ్లందరూ సంతకాలు చేసేసారు. మీరు కూడా సంతకం పెట్టేస్తే..."

అంటూ నసిగాడు.

"చూడు ప్రసాద్! మీకంటే ముందు సబ్మిట్ చేసిన ఫైల్స్, కాగితాలు ఎన్నో ఉన్నాయి. వాటిని కాదని తర్వాతొచ్చిన వాడివి నీ పని ముందు కావాలంటే ఎలా?" ఆశ్చర్యం వెలిబుచ్చాడు.

"మీ సంతకం అయ్యిందంటే ఆ పదివేలూ త్వరగా తీసుకోవచ్చుసార్! డబ్బుతో చాలా అవసరం వుంది. ఈ అయిదు వందలూ తీసు..."

"వ్వాట్! అర్జంటంటావ్, ఫైవ్ హండ్రెడ్ అంటావ్... నాకిదేంనచ్చలేదయ్యా! థౌసెండ్ అని మొదటే చెప్పాను. కాదు కూడదంటే నీ ఇష్టం. ఇరవై రోజుల తర్వాత వచ్చేయ్! పైసా లేకుండా పనైపోతుంది" నిక్కచ్చిగా చెప్పేసాడు శ్రీరంగమూర్తి.

"ప్లీజ్ సర్! అంతకు మించి ఇచ్చుకోలే..." అతని మాట పూర్తి కాకుండానే "ప్లీజ్ డోంట్ వేస్ట్టైమ్!" నెమ్మదిగా చెప్పాడాయన.

ఇక ఆ ముసలాన్ని ప్రాధేయపడి లాభం లేదని వెనక్కి తిరిగొచ్చాడు.

***

"ఏమోయ్! రెండ్రోజులు లీవ్ పెట్టి అప్పుడే వచ్చేశావేం ? పన్డే సరిపోయిందా?" తన గదిలోకి అడుగుపెట్టిన ఫ్యూన్ వెంకటయ్యని చూస్తూ ప్రశ్నించాడు మేనేజర్ శ్రీరంగమూర్తి.

"నిజానికి రేపే వచ్చేదుండె సార్! మా మామయ్య కూడా బలవంతం చేసాడు. కానీ ఓ విషయం తెలిసాక పరుగుపరుగున వచ్చాను" విషయం చెప్పాడు వెంకటయ్య.

"ఏం విషయం?"

"మా బామ్మర్ది బామ్మర్ది కూడా అక్కడే ఓ ఆఫీసులో ఫ్యూన్గా పన్జేస్తున్నాడు. మొన్న వాళ్లాఫీసుకి 'ఆంటికరప్షన్' వాళ్లు రైడింగ్కి వచ్చారట. ఆఫీసులన్నిటినీ రైడింగ్ చేస్తార్ట.

మన ఆఫీసుక్కూడా వచ్చే ప్రపోజల్ ఉందని చెప్పాడు. అందుకే అది తెల్పి మనవాళ్లని జాగ్రత్తగా ఉండమని చెప్పేందుకు వచ్చాను" చెప్పాడు ఫ్యూన్.

'స్టన్' ఐపోయాడు మూర్తి.

ప్రస్తుతం తన చేతులో రెండు 'కేసు'లున్నాయి.

ఒకటి రమణది...!

ఆయన (లంచం) డబ్బు రేపిస్తానన్నాడు.

రెండవ కేసు భానుప్రసాద్‌ది...!!

మొండిఘటం, మళ్లీ రేపు లేదా రోజూ వచ్చినా రావొచ్చు.

అలాంటప్పుడు 'ఆంటీకరప్షన్ వాళ్ళొస్తే?' సన్నని వణుకు పుట్టింది.

అయితే ముందు జాగ్రత్తగా తననపాయం నుండి తప్పించడానికి కబురందించిన వెంకటయ్యని అభినందించకుండా ఉండలేకపోయాడు.

అందుకే "ఈ వార్త తెచ్చినందుకు ఈ రోజు నీకు వర్కింగ్‌డేగా వేసేస్తాను. అవసరమనిపిస్తే మళ్లీ ఊరెళ్ళు లేదు మరెప్పుడైనా యూజ్ చేసుకో" అంటూ చెప్పాడు.

"థాంక్యూసర్" అని చెప్పి వెళ్లిపోయాడతను.

***

రాత్రి ఎనిమిదవుతోంది.

తలుపు చప్పుడైతే వెళ్ళి తీసాడు వెంకటయ్య

ఎదురుగా భాను.

ఆహ్వానించాడతన్ని.

"నీవు చేసిన సహాయానికి ఇదిగో ప్రతిఫలం" వందనోటు అతని చేతులో పెట్టి వెనక్కి తిరిగాడు.

ఫ్యూన్ చేత లీవ్ పెట్టించి, చిన్న నాటకం ద్వారా వెయ్యి రూపాయలతో పెట్టాల్సిన సంతకాన్ని, బెదిరిన మేనేజర్ చేత ఉట్టినే పెట్టించుకున్నాడు.

భాను చిన్న ట్రిక్ ద్వారా వందతో పని జరుపుకున్నాడు.

**(డిసెంబర్, 1985)**

*